# మంచి మాటలు

శ్రీమతి ద్వివేదుల విశాలాక్షి

కొంతమంది స్త్రీలకు మంచి మాటలు చెప్పి ఇతరులచే పనిపాట్లు చేయించుకోడం బాగా చేతనవుతుంది. నిజంగా ఇది ఒక కళ అనవచ్చు. అంతమందికీ ఇది చేతకాదు. మామూలుగా ఇంట్లో పని వాళ్ళ దగ్గర, పిల్లల దగ్గర దీని ఆవశ్యకత ఎంతేనా వుంటుంది. ఒక్కొక్క ఇల్లాలు ఎంత పెట్టినా కొంచముపని ఎక్కువ చేయ వలసి వచ్చేసరికి నావల్ల కాదంటుంది పని మనిషి. ఎక్కువ పెట్టకపోయినా మంచి మాటలతో వారిని పొంగేసి పనిచేయించు కొంటుందొక గృహిణి. "ఆ విడలా నేను డబ్బు ఇవ్వలేదా? నాకెందుకలా చేయ వ"ని సాధించి చేయించుకొంటుందింకొక వనిత. కాని ఈ ముగ్గురిలోనూ మంచిగా పనిచేయించుకొనే ఆమెకే మనస్ఫూర్తిగా పనిచేస్తుంది పనిమనిషి. మిగతా వారికి వెట్టికి చేసినట్లే చేస్తుంది.

అందుకనే మన పెద్దలు "మంచిన విషమేనా తాగించవచ్చుకాని, చెడ్డన పాలేనా తాగించలే" రంటారు. ఈ విషయం చిన్న పిల్లల దగ్గర బాగా రుజు వవుతుంది. పిల్లలు వుదయము లేచింది లగాయతు రాత్రి నిద్రపోయేదాకా అడు గడుక్కీ పేచీలు పెడ్తూంటారు. కొంత మంది తల్లులు వారికి మంచి మాటలు చెప్పి వారిచేత ఆయాపనులను సక్రమంగా చేయి స్తారు. మరికొందరు తల్లులు వారిని పట్టు కొని కొట్టి, తిట్టి వారు ఆ పనులను శ్రద్ధగా చేసేట్టు చూస్తారు. ఇంకొందరు తల్లులు వారు చేయునపుడు శ్రద్ధచూపక తరువాత అవి బాగులేవని వారిని శిక్షి స్తారు. ఈ మూడు రకముల తల్లుల దగ్గర పెరిగిన పిల్లలలో మొదటివారే, అనగా మంచి మాటలచే పనులు చేయించిన తల్లి దగ్గర పెరిగిన పిల్లలే పెద్దవారైనా వారి వారి పనులను సక్రమంగా చేసే అలవాటు కలవాళ్ళవుతారు. చిన్నప్పటినుంచీ వారు ఒక క్రమపద్ధతికి అలవాటుపడివుంటారు. అలాకాక భయమువలన చేసినవారు ఆ భయముపోగానే, అనగా పెద్దవారవగానే ఆ క్రమమువిడిచి ఇష్టమువచ్చినట్లు తిరగ డానికలవాటుపడుతారు.

పిల్లలు క్రమపద్ధతిలో పెరుగుటకు తల్లు లపై ఎంత బాధ్యతవుందో పాఠశాలలలో విద్యాబుద్ధులు నేర్పు గురువులయందు

కూడ అంతా వున్నది. ఇది మనము సాధారణముగా చూస్తునే వుంటాము. ఒక్కొక మేష్టరు దగ్గర పిల్లలు చాల భయభక్తులతో వుంటారు. ఆ పిల్లలే ఇంకొక మేష్టరు దగ్గర పెంకిగాను, అల్లరిగాను వుంటారు. ఈ అతిచనువుకాని, భయముకాని ఉపాధ్యాయులదగ్గర పిల్లలకి వుండడం అంత మంచిదికాదు. క్రిందటికి ఒక పిల్లడిని "అంత కష్టపడి ఆ నోట్సు ఎందుకు రాస్తున్నావబ్బాయి" అని అడిగితే "రాయకపోతే మా మేష్టారు తంతారు" అన్నాడు. అదీ వాడి దృష్టిలో నోట్సుకున్న విలువ. అంతేకాని తనకు చదువు రావాలని రాస్తున్నానన్న సంగతి ఆ కుర్రాడు గ్రహించుకోలేదు. అందుచే పిల్లలకు సరియైన విద్యాబుద్ధులు అలవడాలంటే మంచి మాటలచే పనులు చేయించే నేర్పు ప్రతి తల్లికి, ప్రతి వుపాధ్యాయునికీ వుండాలి.

మంచి మాటలంటే జ్ఞాపకము వచ్చింది. మూడేళ్ల క్రిందట కాబోలు నేను టీచరు ట్రయినింగు చదువుచున్న రోజులు. రాజమండ్రీలో బంధువులెవ్వరూ లేకపోవుటచే ఆడపిల్లల హాష్టలులోవుండి చదువుకొంటున్నాను. మా హాష్టలు వార్డెను మహా గడుసు మనిషి. అన్ని సబ్జెక్టులతోపాటు పాకశాస్త్రం కూడా ఒక సబ్జెక్టుగా వుండేది మాకు. ఈ సబ్జెక్టు చెప్పే ఆవిడే మాకు వార్డెనుగా వుండేవారు. ఆవిడ దగ్గర పాకశాస్త్రంకన్న, మంచిమాటలచే పనులు చేయించుకోవడమెలాగో నేర్చుకోవాలనిపించేది నాకు. మా అందరితోనూ చాలా సరదాగా మాట్లాడుతూ హాష్టలుకి కావలసిన చిన్న చిన్న పనులు తీరిక సమయములందు మాచే చేయిస్తుండేది. ఒక్కొక్కప్పుడు తనూ మా పనులలో పాల్గొనేది. మా సొమ్మంతా ఖర్చుచేస్తూ తిరిగి మాచేత పనులు చేయించడమా? అని మాలో కొందరికి ఆవిడపై కోపంగా వుండేది. కాని ఆవిడ ముందర జవాబు చెప్పలేక పోయేవాళ్ళం.

ఇలా చాలా రోజులు గడచిపోయాయి. ఇక నెల రోజులలో మా ట్రయినింగు పూర్తయి వెళ్లిపోతామనగా ఒక సంఘటన జరిగింది. ఎవరో అధికారులు స్కూలు తణిఖీకి వచ్చేరు. వారికి మా హాష్టలులో విందుచేతామని నిశ్చయించేము. కాని అవి పెళ్లిళ్ల రోజులవడముచే వంటలవాళ్లు దొరకలేదు. హాష్టలులోవున్న వంటవానికి స్వీట్సు చేయడం బాగారాదు. సరే ఏదేనా క్లబ్బునుండి తెప్పించుదామనుకున్నాము. కాని మా వార్డెను అందుకు వప్పుకోలేదు. "స్కూలులో పాకశాస్త్రంకూడా ఒక సబ్జెక్టుగావుంది కాబట్టి మనమే తయారు

చేసి వారికి పెట్టినట్లైతే చాలా బాగుంటుంది. అట్టే డబ్బుకూడా ఖర్చుకాదు'' అన్నారు. దానితో మాకు ఎక్కడలేని కోపము వచ్చింది. ఇంక ఎలాగూ వెళ్లిపోతూన్నాముకదా అని నిర్భయంగా వ్యతిరేకించేము ఆవిడతో. ఈ నాటి విందుకు ఎంత సొమ్మయినా ఖర్చుచేస్తాముకాని, పల్లెత్తు పనైనా ముట్టుకోమన్నాము. వాదవివాదాలు ఎక్కువకాగా, కోపంతో ఆవిడ వెళ్లిపోయింది.

ఆవిడ కోపముతో వెళ్ళిపోవడముచేత మాలో మాకు అభిప్రాయ భేదాలొచ్చాయి. ఇన్నాళ్లు మంచిగావుండి చివరకు ఆవిడకు కోపము తెప్పించడము మంచిదికాదని కొందరు వాదించేరు. మన మీద కోపముచే ఏదేనా చెడ్డరిమార్కు రాసేస్తుందేమో అని భయపడ్డాము. మాలో మేము వాదించుకోడం పూర్తయింది. ఆ రోజు విందుకి కావలసిన ఏర్పాట్లన్నీ చేయడానికి సిద్ధంగా వున్నామని ఆవిడకు కబురు పెడదామని నిశ్చయించేము. ఇంతలో మా స్కూలు బంట్రోతు ఒక నోటీసు పట్టుకొని వచ్చేడు. అందులో ఈ రోజు విందు రద్దుచేయబడ్డాదనీ. మామూలుగా పాకశాస్త్రం ప్రాక్టికల్ క్లాసుకు అందరూ రావలెననీ, అదీకాక ఇన్‌స్పెక్ట్రెస్ వస్తున్నారని రాసివుంది. ఎంతో వుత్సాహంగా విందుకు తయారవబోతూన్న మాకు ఈ వార్త నిజంగా నిరాశకలిగించిందని చెప్పక తప్పదు.

సరిగ్గా టైముకి ప్రాక్టికల్ హాలులోకి వెళ్ళేము అందరమూ. పూర్వపు కోపమంతాపోయి మాతో మామూలుగానే మాట్లాడింది ఆవిడ. ఇంతలో బంట్రోతు ఇంకొక నూతన స్త్రీని రూములో ప్రవేశ పెట్టేడు. ఆవిడే మా కొత్త ఇన్‌స్పెక్ట్రెస్ అయివుంటుందని మేము వూహించేము. మా వూహ సరియైనదే. ఆమె వచ్చిన వెంటనే మేము చెయ్యవలసిన క్రమమంతా చెప్పి ఆమెను ఇంకొక క్లాసులోనికి తీసుకొని వెళ్లేరు మా టీచరు. అందరము పట్టుదలతో శ్రద్ధగా చేస్తున్నాము. వారు తిరిగి వచ్చేలోగా మేము తయారుచేస్తున్న పదార్థాలు పూర్తి కావాలి. ఒక్క అరగంట గడిచింది. రమారమి అన్నీ పూర్తి అయినట్లే. ఇంతలో మా వార్డెను నవ్వుకుంటూవచ్చి; ''ఇంకెందుకట్రా! ఆ తొందర. ఆవిడ వెళ్లిపోయినారు. అర్జంటుగా ఇంకొక స్కూలుకి వెళ్ళాలిట'' అన్నారు. ''అయ్యో! ఇంతాకష్టపడి చేసేము. అదీ కాక ఈ విడగారికోసం విందుకూడా రద్దు చేసుకొన్నాము'' అన్నాం. ''అవును, నిజమే. అన్నీ చెయ్యగానే చేసేరు. ఇవన్నీ వూరకనే పారపోసేకంటే అతిథికారులను పిలిచి పెట్టిస్తే సరిపోతుంది.

మాటా, మర్యాదాకూడా దక్కుతుంది. మరి మీ రేమంటారు?" అన్నారు. "సరే" అన్నాము.

విందు యథావిధిగా పూర్తయింది. అధికారులందరూ మా వంటలను చాల మెచ్చుకొన్నారు. తరువాత తెలిసిన భోగట్టా ఏమిటంటే - మా టీచరు ఆ విందుకొరకే ప్రాక్టికల్ పేరుతో మా చేత



జీవనోపాధికొరకు ...

అవన్నీ చేయించేరుట. ఆ నూతన స్త్రీ ఆమె స్నేహితురాలట. హాస్టలు చూడడానికి వస్తే ఈ నాటకం ఆడారు. ఆవిడ ఇప్పటికీ అంటుంటారు. "ఈనాటి పిల్లలు తిన్నగా చెప్తే వింటారా! వారికెన్ని డొంక తిరుగుళ్లు పెట్టాలి!" అని.